విశాలాంధ్ర అనంతపురం

www.visalaandhra.com కర్నూలు, శనివారం 9 , ఆగస్టు 2025

అధిక వడ్డీ వ్యాపారుల ఆగడాలు అరికట్టాలి

సీపీఐ నగర కార్యదర్శి ఎన్.శ్రీరాములు

విశాలాంధ్ర-అంతపురం : అధిక వడ్డీ వ్యాపారస్తుల ఆగడాలు అరికట్టాలని సిపిఐ నగర కార్యదర్శి ఎన్ శ్రీరాములు డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో ఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి ఎస్పీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఐ నగర కార్యదర్శి ఎన్.శ్రీరాములు మాట్లాడుతూ అనంతపురం 1వ పట్టణ స్టేషన్ పరిధిలోని బంగారు షాపులో పనిచేస్తున్న మైనార్టీ యువకుడిపై వడ్డీ దారులు దాడి చేసినా చట్టపరమైన చర్యలు తీసుకోలేదని, ఆటోడ్రైవర్ బాలకృష్ణపై దాడి చేసి, అతని ఇంటి మహిళలపై అసభ్యంగా ప్రవర్తించి, అతని జీవనాధారమైన ఆటోను తీసుకుపోతానంటూ బెదిరించడంపై స్పందనలో ఫిర్యాదు చేసినప్పటికీ ఆత్మహత్యకు పాల్పడ్డా కూడా పోలీస్ చర్యలు తీసుకోలేదన్నారు. సెంట్రల్ బ్యాంక్ ఉద్యోగి రవికుమార్ 50 వేలు జీతం, రూ.35 వేలు రుణం మీద 1.2 లక్షల రూపాయలు వడ్డీ చెల్లించిన తర్వాత కూడా అధిక వడ్డీదారుల వేధింపులు తాళలేక బాత్రూంలో ఉరేసుకొని ఆత్మహత్య చేకున్నారన్నారు. ఈ ఘటనలు నగరంలో పెరిగిపోతున్న అధిక వడ్డీ దందాలు ఎంత భయంకర స్థాయికి చేరాయని స్పష్టంగా చూపిస్తున్నా, పోలీస్ శాఖ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నదన్నారు. ఇప్పటికీ నగరంలో నిర్దయగా ప్రజల్ని ఇబ్బంది పెడుతున్న అధిక వడ్డీ దందాలపై సిపిఐ నగర సమితి తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోందన్నారు. మితిమీరిన వడ్డీ శాతాలతో పేద, మధ్య తరగతి కుటుంబాలను ఆర్థికంగా దోచుకుంటూ, వారి జీవితాలను నాశనం చేస్తున్న ఈ అక్రమ వ్యాపారాలను నియంత్రించడంలో పాలక వ్యవస్థ పూర్తిగా విఫలమైందన్నారు. అధిక వడ్డీ దందాలపై తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందించాలన్నారు. అక్రమ వడ్డీ వ్యాపారులపై కేసులు నమోదు చేసి కఠిన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఎస్పీ శ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు లింగమయ్య బావిగడ్డ రమణ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సంతోష్‌కుమార్ ఏపీ మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి పద్మావతమ్మ అధ్యక్షులు పార్వతి ప్రసాద్ ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రాజేష్ ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కుల్లాయి స్వామి సిపిఐ నగర సహాయ కార్యదర్శి వి.కృష్ణుడు అల్లిపీరా ఎల్లుట్ల నారాయణ స్వామి, బంగారు భాషరాజు ప్రసాద్ యశోదమ్మ ఏఐవైఎఫ్ నగర అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్, మంజునాథ్, ఆనంద్, సీపీఐ, విద్యార్థి యువజన మహిళా సమైక్య నాయకులు పాల్గొన్నారు..

సీపీఐ పట్టణ మహా సభలను జయప్రదం చేయండి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్

విశాలాంధ్ర-గుంతకల్లు: పట్టణంలో 9, 10 తేదీల్లో జరగనున్న 14వ పట్టణ మహాసభలను విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి జగదీష్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిపిఐ పార్టీ ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి గ్రామస్థాయి నుండి జాతీయ స్థాయి వరకు మహాసభలు జరుపుకొని పార్టీ జరిపిన కార్యక్రమాలను సమీక్షించుకొని మరలా రానున్న మూడు సంవత్సరాలు అనుసరించే రాజకీయ విధానాలను రూపొందించుకొని నూతన నాయకత్వాన్ని ఎన్నుకుంటుదని పేర్కొన్నారు. రాజకీయ ప్రజా దోపిడిని ఎండగట్టడానికి సిపిఐ పార్టీ అహర్నిశలు పోరాటాలు చేస్తుందని అన్నారు. 9వ తేదీన గుంతకల్ పట్టణంలో అజంతా సర్కిల్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ ఉంటుందని ఈ ర్యాలీకి కార్మికులు, కర్షకులు, ప్రజలు, విద్యావంతులు ,విద్యార్థులు, సిపిఐ అభిమానులు పెద్ద ఎత్తున వచ్చి ఈ ర్యాలీని పాత బస్టాండ్ లో బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కాపాడండి..

సిపిఐ పుట్లూరు మండల కార్యదర్శి పెద్దయ్య

విశాలాంధ్ర-శింగనమల : జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కాపాడాలని సిపిఐ పుట్లూరు మండల కార్యదర్శి పెద్దయ్య అధికారులను కోరారు. శుక్రవారం పుట్లూరు మండలంలోని అరకటవేముల గ్రామ సభలో జాతీయ రీసర్చ్ అధికారులు డాక్టర్ సాంబశివరావు, నవ్యకి వినతి పత్రం ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వామపక్ష పార్టీల పోరాటాలతో సాధించుకున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కాపాడాలని కోరారు. 20 ఎకరాల సాగు భూమి ఉన్న రైతు కూడా వర్షాలు సరిగా పడక లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి పంట సాగు చేసినా పంటలు పండక అప్పుల పాలవుతున్నారని, అన్ని వర్గాల ప్రజలు ఉపాధి హామీ పనులకు పోతూ జీవనం చేస్తున్నారని, ఇలాంటిచట్టాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం, బడ్జెట్లో నిధులు తగ్గిస్తూ కొత్త కొత్త రూల్స్ చట్టంలో తెస్తున్నారన్నారు. ఉపాధి హామీ పనులు రెండు పూటల విధానాన్ని రద్దుచేసి ఒక్క పూటే పని చేసేటట్లు చేయాలని, అలాగే పనుల వద్ద మౌలిక వసతులు కల్పించి పని దినాలు 200 రోజులు పెంచి పని అడిగిన ప్రతి ఉపాధి కూలీకి పని కల్పించాలన్నారు, రోజు వేతనం 700 రూపాయలు ఇచ్చి కూలీలకు పనిముట్లు తక్షణమే అందించాలన్నారు.

డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలకు ఆర్థికంగా భరోసా కల్పిస్తూ వారిని అన్ని విధాల ఆదుకోవాలని, సీసీ లు గ్రామ సభలలో సందర్శించడం లేదని, ప్రతి నెల ప్రతి గ్రామంలో గ్రామ సంఘంలో వి వో సమావేశాలు జరగాలని, ఆ సమావేశాలలో సభ్యులు చెల్లించిన అప్పుల చెల్లింపు అప్పుల నిలువ చదివి వినిపించాలన్నారు. మండలంలో ఎక్కడ వి వో సమావేశాలు జరిగినట్లు ఎక్కడ చూపలేదని, డ్వాక్రా సంఘాల ద్వారా ఏయే లోన్లు వస్తాయో పూర్తిగా సభ్యులకు తెలియజేయా లన్నారు. డ్వాక్రా తర్పణ,ఉన్నతి, శ్రీనిధి, బ్యాంకు, పొదుపు, లోన్లు తప్ప మిగతా లోన్లు గురించి సభ్యులకు తెలీదన్నారు. మిగతా లోన్లు సిఐఎఫ్, పీఎంఈజీపి, ఎస్వి ఈపి ఫుడ్ ప్రాసెస్ వంటి లోన్లు వివరాలను సభ్యులకు తెలియజేయ చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో బలరాముడు, ఓబుళపతి, నారాయణ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహా సభలను జయప్రదం చేయండి..

సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి గోపాల్

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం : ఈనెల 12, 13 తేదీలలో అనంతపురం నగరంలో జరగనున్న సిపిఐ 25వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని నియోజకవర్గ కార్యదర్శి గోపాల్ సహాయ కార్యదర్శి నరసింహులు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో కళ్యాణదుర్గం, బ్రహ్మసముద్రం మండల కార్యదర్శులు ఆంజనేయులు, నాగరాజు నాయక్ పట్టణ సహాయ కార్యదర్శి బుడెన్‌తో కలిసి పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడారు. కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న తరుణంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా అనంతపురంలో ఈనెల 12న బహిరంగ సభ 13న ప్రతినిధుల మహాసభను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. కళ్యాణదుర్గంలో జరిగిన 21వ నియోజకవర్గ మహాసభలు లో ప్రజా సమస్యలపై పలు తీర్మానాలు ఆమోదించినట్లు చెప్పారు. జీడిపల్లి, బిటిపి కాలువ భూసేకరణ తక్షణం పూర్తి చేసి పనులు మొదలుపెట్టి 114 చెరువులకు నీళ్ళు నింపాలని, దీని సాధన కోసం సిపిఐ పోరాటాలు కొనసాగిస్తుందని తీర్మానం చేసినట్లు చెప్పారు. తిమ్మసముద్రం లోని 1100 ఎకరాల ఏపీఐఐసీ భూమిలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం మౌలిక సదుపాయాలు కల్పించి, స్థానికులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం ఉద్యమించాలని మహాసభలో తీర్మానం ఆమోదం పొందిందన్నారు. నియోజకవర్గంలో రోడ్ల దుస్థితి అధ్వానంగా ఉన్నదని, రోడ్లు వేసేదాకా స్థానిక ప్రజలతో కలిసి ఆందోళన నిర్వహించాలని తీర్మానం చేసినట్లు చెప్పారు. ఉపాధి అవకాశాలు లేని సోలార్ ప్రాజెక్టులకు బలవంతపు భూసేకరణను వ్యతిరేకిస్తూ అడ్డుకోవాలని వీటితోపాటు మరో ఐదు తీర్మానాలను మహాసభలో ఆమోదించినట్లు తెలియజేశారు.

ఎంతో శ్రమకోర్చి హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు చేశాం

రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

విశాలాంధ్ర-ఉరవకొండ : రికార్డు స్థాయిలో.. కేవలం 100 రోజుల్లో.. ఎంతో శ్రమకోర్చి హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు పూర్తి చేశామని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ స్పష్టం చేశారు. శుక్రవారం ఉరవకొండ నియోజకవర్గం లోని రాగులపాడు వద్ద ఉన్న పంప్ హౌస్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మంత్రి మాట్లాడుతూ రాగులపాడు లిఫ్ట్ ఇరిగేషన్ వద్ద ప్రతిరోజు 8 నుంచి 10 పంపుల వరకు పనిచేస్తున్నాయన్నారు. వర్షాలు ఎక్కువ వచ్చిన రోజున కంట్రోల్ కోసం తగ్గించడం, తర్వాత వెంటనే పది పంపులకు పెంచడం, ఈ రకంగా మైంటైన్ చేస్తున్నారన్నారు. రికార్డు స్థాయిలో మొదటి సంవత్సరంలోనే, కేవలం 100 రోజులు లక్ష్యం పెట్టుకుని ఒకే దగ్గర, ఉరవకొండ ప్రాంతంలోనే దాదాపు రెండు 270 ఎక్స్‌వేటర్లు ఒక కాంట్రాక్టర్‌తో, దాదాపు అంతే స్థాయిలో రెండవ కాంట్రాక్టర్‌తో పనిచేయించడంతో ఈరోజు హంద్రీనీవా కాలువ నీటి సామర్థ్యాన్ని రెట్టింపు చేసుకోగలిగామన్నారు. ఆ తర్వాత డిస్ట్రిబ్యూటర్లను ఏం చేయాలి, పిల్ల కాలువలకు నీరు ఎలా తీసుకువెళ్లాలి అనేది ముందుకు తీసుకువెళ్లడం జరుగు తుందన్నారు. ఎంతో కష్టమైనా కూడా, ఆర్థిక ఇబ్బందులు ఉన్న నేపథ్యంలో తాము ఎప్పుడూ కష్టం అనుకోలేదని, ఇష్టపడి చేసిన పనిగా భావిస్తున్నామన్నారు. జిల్లా రైతులకు ఒక నమ్మకాన్ని ఇచ్చే నీళ్లను చూస్తే మాకు చాలా ఆనందంగా ఉందని, ఇదే రెట్టించిన ఉత్సాహంతో పనిచేసి హంద్రీనీవా మీద ఉన్న అన్ని ప్రాజెక్టులను సాధ్యమైనంత త్వరగా పూర్తిచేసి మమ్మల్ని గెలిపించిన జిల్లా రైతాంగం రుణం తీర్చుకుంటామన్నారు. జగన్ మోహన్ రెడ్డి 2019లో ఉరవకొండ జలదీక్షకు వచ్చి మూడు నెలల్లో హంద్రీనీవా పనులు ప్రారంభిస్తామని చెప్పి ఐదు నెలల్లో గంపమన్ను తీయలేదని గుర్తు చేశారు. పీఏబీఆర్‌ని, ఆ తర్వాత ఎంపిఆర్‌ని బలోపేతం చేస్తామని, జిల్లాలో ఉన్న ప్రతి రిజర్వాయర్‌కు, అవకాశం ఉన్న ప్రతి చెరువుకు నీరంధించే విధంగా హంద్రీనీవాని రూపొందిస్తామన్నారు.

కమ్యూనిస్టు యోధుడు ఎంవి రమణ ఆశయాలు కొనసాగిస్తాం

మొదటి వర్ధంతి సభలో వక్తలు

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం : స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో శుక్రవారం కమ్యూనిస్ట్ పార్టీ సీనియర్ నాయకులు ఎం.వి.రమణ మొదటి వర్ధంతి పార్టీ నగర కార్యదర్శి శ్రీరాములు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్ సహాయ కార్యదర్శి పాళ్యం నారాయణస్వామి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జె.రాజారెడ్డి ఎంవి రమణ కుమారుడు ప్రముఖ న్యాయవాది ఎం. వేణుగోపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జాఫర్ మాట్లాడుతూ రమణ పేద కష్టజీవుల సమస్యల పరిష్కారం కోసం పరితపించేవారని పేర్కొన్నారు. ఆనాటి కాలంలోనే విశాఖ ఉక్కు పరిశ్రమను ఆంధ్రప్రదేశ్లో నెలకొల్పాలని జరిగిన పోరాటంలో విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్‌ను ఉద్యమ బాటలో నడిపారన్నారు. విశాఖ ఉక్కు ఉద్యమనికి రాష్ట్ర కన్వీనర్ గా వ్యవహరించారు. నాటి ఉద్యమ ఫలితంగానే నేడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విశాఖ ఉక్కు పరిశ్రమ ఉందని తెలిపారు.. పేద ప్రజల సమస్యలు ఎక్కడ ఉంటే అక్కడ కమ్యూనిస్టు పార్టీ జెండా ఉండాలని ఆకాంక్షించేవారని, విద్యార్థి యువత నాయకులను ఉద్యమాల వైపు ప్రోత్సహించేవారని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తల వ్యక్తిగత సమస్యలను తెలుసుకొని వారికి అండగా నిలబడేవారని పేర్కొన్నారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పాళ్యం నారాయణస్వామి మాట్లాడుతూ పేద ప్రజల కోసం తన సొంత భూములను పేదలకు దానం చేసిన గొప్ప వ్యక్తి ఎంవి రమణ గారిని కొనియాడారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో ముందుకు సాగే వారిని పార్టీలో నేటితరం నాయకులకు ఎం.వి.రమణ గారు ఆదర్శమని తెలిపారు. నీతికి నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం పేర్కొన్నారు. ఆయన ఆశయాల కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర నాయకులు జాన్సన్ బాబు మాట్లాడుతూ ఎం.వి.రమణ 1970 సవంత్సరంలోనే తన ఉద్యమాన్ని ప్రారంభ మందును సురవరం, ఆజీజ్ పాషా, ప్రతాప్ రెడ్డి వంటితో విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు ఉద్యమాన్ని తన భుజాన వేసుకుని నిబద్ధత, ఆశయాలతో విజయవంతంగా నడిపారని.. హైదరాబాదు నుండి అనంతపురం జిల్లాకు వచ్చి తన కొనఊపిరి వరకు ప్రజా ఉద్యమాలు చేసి ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు.కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.రమణ సి.లింగమయ్య సంతోష్ కుమార్, రాజేష్ గౌడ్, పద్మావతి నాగరాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయి స్వామి, సిపిఐ నగర సహాయ కార్యదర్శి వి కృష్ణుడు, నగర కార్యవర్గ సభ్యులు అల్లిపీరా, టీవీ టవర్ శ్రీనివాసులు, చాంద్ భాషా, రాజు, నాగప్ప ఏఐఎస్ఎఫ్ మంజునాథు ఏఐవైఎఫ్ శ్రీనివాస్, మహిళా సమైక్య యశోదమ్మ పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగ ర్యాలీ..

.. **విశాలాంధ్ర-అనంతపురం:** అజాదికా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా హర్ ఘర్ తిరంగ ర్యాలీని నగరంలోని టవర్ క్లాక్ నుండి మున్సిపల్ కార్యాలయం వరకు నిర్వహించారు. శుక్రవారం నిర్వహించిన ఈ ర్యాలీలో జిల్లా పర్యాటక అధికారి, నోడల్ అధికారి జయకుమార్ బాబు, అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు, డిఈఓ ప్రసాద్ బాబు, తహసీల్దార్ హరికుమార్, క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు, ఆన్ సెట్ పోలీసు శాఖ అధికారులు, అన్ని క్రీడా యువత, పౌరులు, విద్యార్థులు, పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా పర్యాటక అధికారి జయకుమార్ బాబు, ఆర్డీఓ కేశవనాయుడు మాట్లాడుతూ అజాదికా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా హర్ ఘర్ తిరంగ ర్యాలీని విజయవంతం చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

సీపీఐ నాయకుడు శివన్న కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి

విశాలాంధ్ర-ఉరవకొండ: గత రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మరణించిన సిపిఐ పార్టీ ఉరవకొండ నియోజకవర్గం సీనియర్ నాయకులు కామ్రేడ్ శివన్న ఇంటిని శుక్రవారం రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సందర్శించి ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. శివన్న మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా.. శివన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయాలి : ఎంపీ

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం: అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ శుక్రవారం న్యూఢిల్లీలో నేషనల్ హార్టికల్చర్ బోర్డ్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రియారంజన్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సమగ్ర ఉద్యానవన అభివృద్ధి మిషన్ కింద అనంతపురం జిల్లాకు సంబంధించిన ప్రాజెక్టుల పురోగతిపై సమీక్షించి, వీటిని వేగవంతం చేయాలని సూచించారు. ఈ చర్చలో భాగంగా గత ఐదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం ఉద్యానవన నిధులను సక్రమంగా వినియోగించకపోవడం వల్ల కేంద్ర ప్రభుత్వం రూ.505 కోట్లలో సుమారు రూ. 300 కోట్లు విడుదల చేయకపోయిన విషయాన్ని అధికారులు వెల్లడించగా, ఇది సరికాదని ఎంపీ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే కుప్పంలో ఏర్పాటైన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సిఓఈ) ను అనుసరించి, చిత్తూరు జిల్లా కుప్పం, పల్నాడు, అరకు ప్రాంతాల్లో కొత్తగా సిఓఈలు ఏర్పాటు చేస్తున్నట్టు సమాచారం ఇచ్చారు. ఈ సందర్భంగా అనంతపురం జిల్లాలో అరటి, పప్పాయ, చీనీ, దానిమ్మ, జామ, సపోటా, టమాటో వంటి ఉద్యానవన పంటల అభివృద్ధికి ప్రత్యేకంగా ఒక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయాలని ఎంపీ అధికారులను కోరారు. అంతేకాకుండా, రైతులకు అవసరమైన కోల్డ్ స్టోరేజీలు, పోస్ట్ హార్వెస్ట్ ప్రాసెసింగ్ యూనిట్లు వంటి పెండింగ్ ప్రాజెక్టులకు త్వరితగతిన అనుమతులు ఇవ్వాలని, తద్వారా రైతులకు మార్కెట్ లింకేజీలు విలువ జోడింపు అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

రైతుల అభ్యున్నతి ఉద్యానవన రంగ అభివృద్ధి పట్ల ప్రభుత్వం నిబద్ధతతో ఉండాలని, అనంతపురం జిల్లా ఉద్యానవన రంగంలో ముందంజ వేయాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ స్పష్టంచేశారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

విశాలాంధ్ర-యాడికి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పరమేశ్వర్, సాయి సుమంత్ రెడ్డి ఆధ్వర్యంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు శుక్రవారం కోన రోడ్డు కాలనీ ప్రజలకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ మురుగు నిల్వ ఉన్న ప్రాంతంలో అబ్బేట్ పే చేయడం జరిగిందన్నారు. ఇంట్లోని తొట్లలో లార్వా లేకుండా చూసుకోవాలని కాలనీ ప్రజలకు తెలిపారు ప్రతి శుక్రవారం డ్రై డే ఫ్రైడే పాటించాలని అన్నారు.ఆశా కార్యకర్తలు లక్ష్మీ లీలావతి సారమ్మ పాల్గొన్నారు.

గుంత... ప్రయాణికులకు చింత

విశాలాంధ్ర-బొమ్మనహాళ్ : మండలంలోని బందూరు-ఉద్దేహాళ్ రహదారిపై గుంతలు ఏర్పడటంతో వాహన చోదకులు ప్రయాణానికి ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలంలో గుంతల్లోకి నీరు చేరడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. బందూరునుండి ఉద్దేహాళ్ పాఠశాలకు విద్యార్థులు వెళ్లేందుకు చాలా ఇబ్బందులు పడుతున్నారు.అధికా రులు స్పందించి గుంతలను పూడ్చాలని చోదకులు విద్యార్థిని విద్యార్థులు కోరుతున్నారు.

వైభవంగా వరలక్ష్మీ వ్రతాలు

విశాలాంధ్ర-తాడిపత్రి: పట్టణంలోని సంజీవ్ నగర్‌లో వెలసిన గాయత్రీ దేవి దేవాలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. మొదటగా ఉదయం వేకువజామునే పురోహితుల చేత గాయత్రీ దేవికి అభిషేకాలు, పుష్పాలంకరణ, ఆకు పూజ, కుంకుమార్చన, నైవేద్యం, పండ్లు సమర్పించి, మంగళ హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతేకాకుండా పురోహితులు ముత్తైదువులచే వరలక్ష్మీ వ్రతం ఆచరింప చేశారు. అనంతరం భక్తులు, ముత్తైదువులు గాయత్రి దేవుని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన అల్పాహారం భుజించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం : నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు హర్షం శుక్రవారం కళ్యాణదుర్గంలోని ఎన్టీఆర్ భవన్ వద్ద చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. నాయి బ్రాహ్మణులకు గత టిడిపి హయాంలో ఆదరణ పనిముట్లు అందించే ఆదుకున్నారని ఇప్పుడు 200 యూనిట్ల వరకు కరెంటు ఉచితంగా అందించడం తమ పట్ల చంద్రబాబుకు ఉన్న ప్రేమ అనురాగాలను తెలియపరుస్తుందని హర్షం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే సురేంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గౌరవ అధ్యక్షులు మల్లికార్జున స్వామి, యోగానంద, మోహన్ ప్రకాష్, పట్టణ అధ్యక్షుడు రవి, ఉపాధ్యక్షుడు జమునాథ్, నియోజకవర్గ సోషల్మీడియా ఇన్చార్జ్ తిమ్మప్ప నాయకులు కంబదూరు సుధాకర్, నరసింహులు, సురేంద్ర, వెంకటరమణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం....

విశాలాంధ్ర-యాడికి : 33 కెవి రాయల్ చెరువు ఫీడర్లో మరమ్మత్తులు చేస్తున్న దృష్ట్యా శనివారం దయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 వరకువిద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుం దని ట్రాన్సుకో ఏఈ విజయుడు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

విశాలాంధ్ర-తాడిపత్రి: 33 కెవి ఉప కేంద్రంలో , 220 కెవి తేరన్నపల్లి విద్యుత్ ఉప కేంద్రాలలో మరమ్మతుల కారణంగా ఆగస్టు 9వ తేదీన రెండవ శనివారం ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 2:00 గంటల వరకు తాడిపత్రి పట్టణ, తాడిపత్రి పరిసర గ్రామాలు యాడికి పట్టణ, యాడికి పరిసర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంది. కావున వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ అధికారులు కోరారు.

అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని కలుపేదే రాఖీ పండుగ

అనంతపురం ఎంపీకి రాఖీ కట్టిన బైరెడ్డి శబరి

విశాలాంధ్ర-బ్యూరో అనంతపురం :

రాఖీ పండుగను పురస్కరించుకుని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి పార్లమెంట్‌లో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణకు రాఖీ కట్టి తమ అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని చాటారు. ఈ సందర్భంగా అంబికా మాట్లాడుతూ సోదర సోదరీమణుల బంధం ఎంత విలువైనదనని ఆయన గుర్తుచేశారు. భారతీయ సంస్కృతిలో ఉన్న బంధాలు, ఆచారాలు రాజకీయ వేదికలకూ చక్కగా ప్రాధాన్యం కలిగిస్తున్నాయి అనే విషయం మరోసారి తేటతెల్లమైందని ఎంపి అన్నారు. బైరెడ్డి శబరి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సమస్యను పార్లమెంటులో లేవనెత్తి పరిష్కార దిశగా అడుగులు పడడంలో అందరి కృషి మరవలేనిదని ఈ లాంటి ఆనంద సమయంలో రాఖీ పండుగ రావడం శుభ పరిణామమన్నారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 9 , ఆగస్టు 2025

హంద్రీనీవా కాలువ పనులను తర్వగా పూర్తి చేయండి

కలెక్టర్ టి ఎస్ చేతన్

విశాలాంధ్ర-విశాలాంధ్ర బ్యూరో .. కలెక్టర్ టిఎస్ చేతన్ హంద్రీనీవా సుజల స్రవంతి కాలువలో యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్న పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ప్యాకేజీ-4లోని సొరంగం (కెఎం 358.000 టు కెఎం 360.100) చివరి భాగంలో జరుగు పనులను పరిశీలించి శరవేగంగా పనులను పూర్తిచేయమని అధికారులను ఆదేశించారు. సొరంగం లోపలికి సుమారుగా 600మీ. మేరకు వెళ్లి పనులను పరిశీలించారు. ఎంత మేరకు మట్టి పని, ఎస్ ఎఫ్ ఆర్ సి, లైనింగ్ పనులు జరిగినదని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాలువ వివరాలు తెలుసుకొని క్రిందకు అనగా పుంగనూరు బ్రాంచ్ కాలువ, కుప్పం బ్రాంచ్ కాలువకు నీరు పంపుటకు సిద్ధంగా ఉండాలని ఆజ్ఞాపించారు. అంతేకాకుండా ఎస్సీ ఏపీ ఎస్‌పి డిసి ఎల్ ఏపిఎస్‌పిడిసిఎల్ వారిని కాలువలోని కాలువ గట్టున ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించమని ఆదేశించారు. పై చెప్పిన పనులు ఆగష్టు -15 లోపల పూర్తి చేయాలని చెప్పడం జరిగినది. ఈ కార్యక్రమంలో హెచ్ఎన్ఎస్ ఎస్సీ ఎ.రాజా స్వరూప్‌కుమార్, హెచ్ ఎన్ఎస్ఎస్ ఈఈ మురళి ఏపీ ఎస్పీడీసీఎల్ ఈఈ ఇరిగేషన్ అధికారులు, బీసర్ ఏజెన్సీ డైరెక్టర్ జి.పూర్ణ ప్రసాద్, విద్యుత్ శాఖ ఎస్ ఏఈ సంపత్ కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్‌కు ఘన సన్మానం..

విశాలాంధ్ర - హిందూపురం : ఆంధ్రప్రదేశ్ ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం ఉమ్మడి కుటుమి ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తుందని ముస్లింల పవిత్రమైన మక్కా యాత్రకు బయలుదేరే వారికోసం లక్ష రూపాయలు సబ్సిడీ అందించి వారికి అండగా నిలుస్తుందని అటువంటి ఉమ్మడి కుటుంబ ప్రభుత్వాన్ని ముస్లిం మైనార్టీలు మంచి మనసుతో ఆశీర్వదించాలని శుక్రవారం ఆంధ్ర రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ హుస్సేన్ భాషా సాబ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన హిందూపురం స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కార్యాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ మైనారిటీస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో హజ్ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ, నందమూరి బాలకృష్ణ హిందూపురం ముస్లిం మైనార్టీల కోసం జామియా మసీదుకు రూ.2.50 కోట్లు మంజూరు చేయించడం అభినందనీయమని, ముస్లింలకు రాష్ట్రస్థాయి పదవులు కేటాయించడం ముస్లింల పట్ల ఉన్న అభిమానాన్ని చాటుకున్నారని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రులు నారా లోకేష్‌లు ముస్లింలు అభివృద్ధి సంక్షేమాన్ని కోసం వివిధ ప్రణాళికలు చేస్తున్నారని, త్వరలోనే దుల్హన్ పథకం అమలు చేస్తారని, మక్కా బయలుదేరే విషయంలో హజ్ యాత్రికులు తగు సూచనలు పాటించాలన్నారు. విజయవాడ విమానాశ్రయం నుంచి వారి ప్రయాణాన్ని ప్రారంభిస్తే వారికి ఖాతాలో లక్ష రూపాయలు జమ అవుతుం దని, ఈ అవకాశాన్ని హజ్ యాత్రికులు వినియోగించు కోవాలని పేర్కొన్నారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ డీఈ. రమేష్ కుమార్, పట్టణ అధ్యక్షులు ప్రెస్ వెంకటేష్, హచ్ కమిటీ సభ్యుడు డైమండ్ బాబ, ఫక్రుద్దీన్, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ అనిల్ కుమార్, మైనారిటీ పట్టణ అధ్యక్షులు ఎస్.అస్మతుల్లా, కౌన్సిలర్ ఆయూబ్, నాయకులు నజీర్ అహ్మద్, దాదాఖాన్, అమీన్, ఫక్రుద్దీన్, భాషా, అన్వర్, ఫాజిల్, మహబూబ్ భాషా, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి పేరిట రూ.కోటి అవినీతి..

మండల సిపిఐ కార్యదర్శి చెల్లా శ్రీనివాసులు

విశాలాంధ్ర-ముదిగుబ్బ:

మండలంలో ముదిగుబ్బ మేజర్ పంచాయతీ పాటు అన్ని పంచాయతీ గ్రామాల్లో అభివృద్ధి పేరిట భారీ ఎత్తున అవినీతి జరిగిందని సిపిఐ పార్టీ నాయకులు శుక్రవారం ముదిగుబ్బ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆరోపించారు, ఆ పార్టీ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు ఈ సందర్భంగా మాట్లాడుతూ, ముదిగుబ్బ పంచాయతీ అధికారితో పాటు మండలంలోని అన్ని సచివాలయాల కార్యదర్శిలు వారి వారి పరిధిలో అభివృద్ధి పనుల పేరిట కొన్ని పనులు చేయకున్నా చేసినట్లు రికార్డులు సృష్టించి కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు, ఈ నేపథ్యంలో మండలంలో దాదాపు కోటి రూపాయలు అవినీతి జరిగినట్లు తెలిపారు, కాగా ఈ అవినీతిని అరికట్టాల్సిన ఇంచార్జ్ ఎంపీడీవో దివాకర్ తో పాటు మండల ప్రజా ప్రతినిధులు కూటమి నాయకులు పంచాయతీ కార్యదర్శులు చేసిన అవినీతిని ప్రశ్నించకుండా అందుకు భిన్నంగా వారు కూడా అవినీతిపరులకే మద్దతిస్తూ ప్రోత్సహించడం పలు అనుమానాలకు తావిస్తోందని.. సిపిఐ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు, ఇప్పటికైనా తక్షణమే మండలంలో జరుగుతున్న అవినీతిని అరికట్టకపోతే సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో అన్ని ఆధారాలతో త్వరలోనే జిల్లా కలెక్టరును కలిసి పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న ఈ అవినీతి గురించి విన్నవిస్తామని ఈ సందర్భంగా సిపిఐ నాయకులు తెలియజేశారు,

వర్షాలకు కూలిన ఈదుల వంక బ్రిడ్జి ..

పరిశీలించిన టీడీపీ క్లస్టర్ ఇంచార్జ్ తుమ్మల మనోహర్

విశాలాంధ్ర-ముదిగుబ్బ : మండలంలో గురువారం కురిసిన వర్షాలకు మల్లెపల్లి పంచాయతీ తదితర15 గ్రామాలకు వెళ్లేదారిలో ఉన్న ఈదుల వంక బ్రిడ్జి కూలిపోయింది, ఈ విషయం తెలుసుకున్న ధర్మవరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు మండల క్లస్టర్ ఇంచార్జ్ తుమ్మల మనోహరహుటాహుటిన అక్కడికి వెళ్లి, కూలిపోయిన బ్రిడ్జిని పరిశీలించి వెంటనే అధికారులతో చరవాణి ద్వారా మాట్లాడారు. గ్రామస్తులకు ఇబ్బంది కలగకుండా మరమ్మతులు చేయాలని కోరారు.

మారాల రిజర్వాయర్‌లో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

విశాలాంధ్ర-బుక్కపట్నం:

మండల పరిధిలోని మారాల రిజర్వాయర్‌లో గుర్తుతెలియని పురుషుని శవం లభ్యమైనట్లు ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు రిజర్వాయర్ సమీపంలోని పలువురు రైతులు రిజర్వాయర్ లో దుర్వాసన రావడంతో పోలీసులకు సమాచారం అందించారు. శుక్రవారం ఎస్సై వెళ్లి పరిశీలించగా పూర్తిగా గుర్తుపట్టడానికి వీలు లేకుండా పురుషుని మృతదేహం లభించినట్లు తెలిపారు. మృతిని వివరాలు వైద్యుల నివేదిక ద్వారా తెలియాల్సి ఉంది.

వైసీపీలో కీలక నాయకుల తొలగింపులో ఆంతర్యం ఏమిటో.. ?

విశాలాంధ్ర-చిలమత్తూరు : కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడింది అన్న రీతిలో హిందూపురం నియోజకవర్గంలో వైసిపి మాత్రం కొండ నాలుకకు మందు వేయకుండా ఉన్న నాలుకను కోసుకుంటున్నది.. చేతికి గాయమైతే చేయి నరికేస్తామా..! కానీ ఆ నియోజకవర్గంలో జరిగింది. వైసీపీలో రచ్చకెక్కిన నాయకులను కూర్చుండబెట్టి మాట్లాడాల్సిన అధిష్టానం వారి మధ్య మరింత అగాధాన్ని సృష్టించింది, దీంతో ఇద్దరు కీలక నేతలను సస్పెన్షన్కు గురి చేసింది. ఇందులో ఆంతర్యమేమిటోనని అర్థం కాని పరిస్థితి నెలకొంది, హిందూపురం నియోజకవర్గానికి ఒక ప్రత్యేకత ఉంది తెలుగుదేశం పార్టీకి దివంగత నేత తారక రామారావు టిడిపిని స్థాపించినప్పటి నుంచి నేటి వరకు కంచుకోటుగా మారిపోయింది, ప్రతిపక్షాలు ఎన్ని వచ్చినా ఆ పార్టీని కదిలించలేకపోయారు అయితే వైసిపి క్రియ తప్పిదాల వలన రెండుసార్లు గెలిచే అవకాశాన్ని చేజార్చుకున్నదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి, ముఖ్యంగా వైసీపీలో కీలక నేత నవీన్ నిశ్చల్‌ను పార్టీ నుండి సస్పెండ్ చేయడం తీవ్ర సంచలనంగా మారింది. దాదాపు 40 సంవత్సరాలుగా ఆయన రాజకీయాల్లో ఉన్నారు హిందూపురంలో సేవా కార్యక్రమాలు చేయడంలో ఆయనకు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకొన్నారు, ఆయన 2009లో కాంగ్రెస్ పార్టీ తరఫున టికెట్ ఇవ్వకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగి రికార్డ్ స్థాయిలో ఓట్లను గుంజారు ఓడిపోయినను తన ప్రభావం చూపారు 2014లో వైసీపీ నుండి పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమి చవి చూశారు, 2019 వైసీపీలో స్థానికులకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకుండా మహమ్మద్ ఇక్బాల్ దించారు, దీంతో టిడిపి మరింతగా పుంజుకుని విజయకేతనం ఎగరవేసింది, అలాగే 2024లో వైసిపి అంతర్గత రాజకీయాలతో తప్పటడుగు వేస్తూ వచ్చింది, రీజినల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సన్నిహితుడైన వేణురెడ్డి సతీమణి కురుబ దీపకను వైసిపి అభ్యర్థిగా ప్రకటించారు దీంతో టీడీపీలో మరింతగా బలపడి మెజార్టీతో విజయం సాధించింది, ఇటీవల జులై 8 న హిందూపురంలో వైయస్సార్ జయంతి ని ఎవరికి వారు పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించారు, ఇలా జరిగిన కొద్ది రోజులకే అధిష్టానం నుంచి నవీన్ నిశ్చల్, కొండూరు వేణుగోపాల్ రెడ్డి పై ఐ కమాండ్ సస్పెన్షన్ వేటు వేసింది, దీంతో ఆ పార్టీలో నాయకులను మండలాలలో సమావేశాలు ఏర్పాటు చేసి వైసీపీ నేతలు ఓకే తాటిపై నడవాలని సూచించారు, అయితే నవీన్ నిచల్ 15 సంవత్సరాలుగా బాలయ్యతో పోటీ పడుతున్న వైసీపీ అధిష్టానం సస్పెన్షన్ గిఫ్ట్‌గా ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు, అధిష్టానం ముందు నుంచి ఇవే తప్పులు చేస్తున్నదని కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు, అయినను నా వంతు కురుబ దీపికకు సహాయ సహకారాలు అందించానన్నారు, పార్టీకి సహకారాలు అందించలేదని నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానన్నారు, ఏది ఏమైనా నిజా నిజాలు వెలుగులోకి వస్తాయని, జగన్‌తోనే ఉంటానని, స్థానిక ఎన్నికల్లో నేనేంటో పార్టీకి తెలిసేలా చేస్తానని తెలిపారు, 2029 ఎన్నికలలో వైసీపీ అభ్యర్థిగా ఉంటానన్నారు, అదేవిధంగా కొండూరు వేణుగోపాల్ రెడ్డి కూడా పార్టీలో కీలక నేతగా ఉన్నను అధిష్టానం సస్పెన్షన్ వేటు వేయడం బాధాకరమన్నారు, దీంతో హిందూపురం కంచుకోటలో టిడిపి మరింత బల్పడుతుందని వైసిపి తీసుకున్న నిర్ణయం పట్ల బాలయ్యకు కలిసి వచ్చిందని పలువురు మేధావులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

దాల్ మిల్ సూరిపై పీడీ యాక్ట్ నమోదు:- ఎస్పీ

విశాలాంధ్ర-పుట్టపర్తి: వ్యాపార లావాదేవీల్లో పలు మోసాలకు పాల్పడుతూ తప్పించుకు తిరుగుతున్న శ్రీ సత్యసాయి జిల్లా కొత్తచెరువుకు చెందిన దాల్ మిల్ సూరి పై లుక్ అవుట్ నోటీసులు జారీ చేస్తామని ఎస్పీ రత్న పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ రత్న విలేకరులతో మాట్లాడుతూ పుట్టపర్తిలో ఆమె సూరికి సంబంధించి పలు కేసుల వివరాలను వెల్లడించారు. దాల్ మిల్ సూరిపై రాష్ట్రవ్యాప్తంగా 36 కేసులు నమోదయ్యా యన్నారు. అదేవిధంగా ఒక ఆస్తి తగాలకు సంబంధించి కొందరు వ్యక్తులపై దాడి చేసిన ఘటనలో 307 కేసు నమోదు చేశామన్నారు. అంతర్ రాష్ట్రాలలో కూడా ఆయన నేరాలకు పాల్పడినట్లు ఆధారాలు ఉన్నాయన్నారు. బియ్యం, ఆయిల్, సిమెంట్, పప్పు దినుసులు ఇలా పలు వ్యాపారాలు చేస్తూ మధ్య వ్యాపారులను, రైతులను గత కొన్ని సంవత్సరాలుగా మోసం చేస్తున్నట్లు తెలియ జేశారు. సమస్య తీవ్రంగా మారినప్పుడు మోసపోయిన వ్యక్తులకు ఎంతో కొంత చెల్లించి జాగ్రత్తలు పడుతూ వస్తున్నట్లు తెలియ జేశారు. ప్రజలు ఇటువంటి వ్యక్తులతో వ్యాపార లావాదేవీల పట్ల అప్రమత్తంగా ఉండా లన్నారు. దాల్మిల్ సూరికి సంబంధించిన కేసులపై ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ కు కూడా సమాచారం అందించామన్నారు. దాల్ మిల్ సూరికి సంబంధించిన సమాచారం అందించిన వారిని పోలీసు శాఖ తరపున సన్మానిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి విజయ్ కుమార్, కొత్తచెరువు సీఐ మారుతి శంకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ కృష్ణదేవరాల విగ్రహం కోసం భూమి కేటాయించాలి

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ కొండపై ఎకరం భూమి శ్రీ కృష్ణదేవరాయల విగ్రహం కోసం కేటాయించాలని శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణానికి చెందిన బలిజ కులస్తులు డిమాండ్ చేశారు. శుక్రవారం కృష్ణదేవరాయల 516 పట్టాభిషేక మహోత్సవం పురస్కరించుకొని పట్టణంలోని విగ్రహానికి పాలాభిషేకం అనంతరం పూలమాలవేసి ర్యాలీగా 44వ జాతీయ రహదారి వద్ద ఉన్న 50 అడుగుల శ్రీ కృష్ణదేవరాయుల విగ్రహం వద్దకు చేరుకున్నారు. శ్రీకృష్ణదేవరాల విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా బలిజ కులస్తులు మాట్లాడుతూ. శ్రీ కృష్ణ దేవరాయల జయంతి మహోత్సవ ఉత్సవాలను ప్రభుత్వం ఘనంగా నిర్వహించాలని, శ్రీ లక్ష్మీనరసింహస్వామి కొండపై శ్రీకృష్ణదేవరాయల విగ్రహం ఏర్పాటుతోపాటు ఎకరం భూమి కూడా కేటాయించాలని అందులో పార్కు, కళ్యాణమండపం ఏర్పాటు చేసుకుంటామని అన్నారు. అలాగే బలిజ కులస్తులకు ప్రత్యేకంగా కార్పొరేషన్ ద్వారా నిధులు విడుదల చేసి రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు బలిజ కులస్థులు పాల్గొన్నారు.

అనాథ వృద్ధులకు పండ్లు, వస్త్రాల వితరణ

విశాలాంధ్ర-అమడగూరు: మండల పరిధిలోని శ్రీ మాతృశ్రీ వృద్ధాశ్రమంలో తలుపుల మండలం పెద్దపల్లి గ్రామం వాస్తవ్యులు నాగిరెడ్డి గంగిరెడ్డి వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు, కుమార్తెలు, నాగ శిల్ప ధనలక్ష్మి, శ్రీ తేజ, శ్రీ నిధి,గీతారెడ్డి, కుమారులు రామాంజి వృద్ధులకు చీరలు, పంచలు, టి షర్ట్, షార్ట్స్ అందజేసి మానవత్వం చాటుకున్నారు. ఆశ్రమ నిర్వాహకురాలు అరుణ జ్యోతి మాట్లాడుతూ వృద్ధుల పట్ల జాలి, దయ, దాన గుణం, మానవత్వ దృక్పథంతో సహాయం అందజేసినందుకు వారి కుటుంబ సభ్యులు ఎల్లవేళలా సుఖసంతోషాలతో ఉండాలని మనస్ఫూర్తిగా భగవంతుని ప్రార్థించారు. గంగిరెడ్డి ఆత్మకు శాంతి చేకూర్చాలని కోరుకున్నారు.

వత్తి పత్తి అలంకరణలో వాసవి కన్యకా పరమేశ్వరి..

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని కే పిటి వీధిలో గల వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో శ్రావణమాసం మూడవ శుక్రవారం, వరలక్ష్మి వ్రతం పండుగ సందర్భంగా వాసవి మాతను వత్తి పత్తితో అలంకరణ చేశామని వాసవి మహిళా మండలి అధ్యక్షురాలు పోలమడ రూప రాగిణి, కార్యదర్శి కాకుమాని కళ్యాణి, తదితర మహిళా మండలి సభ్యులు తెలిపారు. అనంతరం అర్చకులు తొలుత వాసవి మాతకు ప్రత్యేక పూజలతో పాటు అర్చనలు, అభిషేకాలను నిర్వహించారు. అనంతరం మహిళల నడుమ అర్చకులు సామూహిక వరలక్ష్మీ వ్రతం వేద మంత్రాలు మంగళ వాయిద్యాల నడుమ నిర్వహించారు. 25 కేజీల పత్తిని(పదివేల రూపాయల ఖర్చు) అలంకరణకు ఉపయోగించారు.

పెద్దమ్మ తల్లికి గాజులతో ప్రత్యేక అలంకరణ : పట్టణంలోని సాలే వీధిలో వెలిసిన శ్రీ పెద్దమ్మ తల్లికి శ్రావణమాసం, వరలక్ష్మీ వ్రతం పండుగ సందర్భంగా బుగ్గ వంశస్తుల ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లికి గాజులతో అర్చకులు వెంకటేష్ శర్మ ప్రత్యేక అలంకరణ చేశారు. అమ్మవారికి పంచామృతాలతో, విశేష మంగళ ద్రవ్యాలతో అభిషేకం, ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించామని తెలిపారు. మహిళలు సామూహిక లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు.

అమ్మవారికి వెండి కవచం అందజేత

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని పుట్టపర్తి రోడ్డు, సాయి నగర్ లో వెలసిన శిరిడి సాయిబాబా ఆలయంలో నూతనంగా నిర్మించిన ఆలయంలోని త్రిపుర సుందరీ దేవి అమ్మకు పట్టణంలోని వందనాతం సూర్య ప్రకాష్, ఉమా అనే దంపతులు వెండి కవచాన్ని శుక్రవారం ఆలయ కమిటీ వారికి అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు వీరనారాయణ, ఉపాధ్యక్షులు నారాయణరెడ్డి, కార్యదర్శి రామలింగయ్య, ఉప కార్యదర్శి నాయుడు, కోశాధికారి సూర్య నారాయణలు ఆ దంపతులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం వారి పేరిట ప్రత్యేక పూజలు చేసి ఘనంగా సత్కరించారు.

24న ధర్మవరంలో జేవీవీ జిల్లా మహాసభ

విశాలాంధ్ర-ధర్మవరం: ఈనెల 24 వ తేదీన ధర్మవరం పట్టణంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా మహాసభ నిర్వహిస్తున్నట్లు జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు తెలిపారు. శుక్రవారం స్థానిక సూర్య స్కూల్ లో పట్టణ అధ్యక్షుడు డి.చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో అయన మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల్లో జిల్లా వ్యాప్తంగా జెవివి నిర్వహించిన కార్యక్రమాలను సమీక్షించుకుని రాబోయే రెండు సంవత్సరాల్లో శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం ఎలా పని చేయాలి? అనే ప్రణాళికను రూపొందించి నూతన కమిటీని ఎన్నుకుంటామన్నారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి వై. నరేంద్ర బాబు, లోకేష్, సురేష్, బండారు మల్లికార్జున, మనోహర్, ఖలందర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

విశాలాంధ్ర-ధర్మవరం: ధర్మవరం పట్టణంలో ఈ నెల 9వ తేదీ శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ ఏడి. లక్ష్మీనరసింహారెడ్డి తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ పట్టణంలోని రామ్ నగర్ లో గల 132/11 కెవి సబ్ స్టేషన్ లో మరమ్మత్తుల ఉన్నందున, అత్యవసరంగా విద్యుత్ సరఫరా ఉండదని పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

స్పందన ఆసుపత్రిలో ఆన్‌లైన్‌లో అపాయింట్‌మెంట్ సదుపాయం

విశాలాంధ్ర-ధర్మవరం : పట్టణంలోని పుట్టపర్తి రోడ్ స్పందన హాస్పిటల్, అండ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో టోకెన్ పద్ధతికి స్వస్తి చెప్పి రెండు రకాలుగా వెబ్‌సైట్‌లోను, మొబైల్ యాప్ (ఆండ్రాయిడ్ యాప్) ఇలా ద్వారా ముందుగానే వైద్యులను సంప్రదించేందుకు అపాయింట్మెంటు చేసుకొనే అవకాశాన్ని కలిగిస్తున్నట్లు స్పందన హాస్పిటల్ అధినేతలు డాక్టర్ బషీర్, డాక్టర్ సోనియాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఆవరణలో స్టిక్కర్స్‌ను విడుదల చేశారు. అనంతరం డాక్టర్ బషీర్ మాట్లాడుతూ అధునాతన వైద్య సేవలు, ప్రత్యేక వైద్యుల వివరాలు, ఆపరేషన్, డయోగ్నిస్టిక్ పరీక్షల వివరాలతో టోకెన్లు కూడా బుక్ చేసుకునే సౌకర్యం కల్పించామని, క్యూఆర్ కోడ్ను కూడా అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రజలు ఈ సౌకర్యాలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

డెవలప్మెంట్ చార్జీలపై 50 శాతం తగ్గింపు

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణ గ్రామీణ ప్రాంతములలో గల గృహ విద్యుత్ వినియోగదారులకు అదనపులోడు పెంచుకుంటే విద్యుత్ చార్జీలపై డెవలప్మెంట్ చార్జీల మీద 50 శాతం తగ్గించబడునని శుక్రవారం విద్యుత్ శాఖ ఏడి. లక్ష్మీనరసింహారెడ్డి తెలిపారు. గృహాలలో ఒక కిలోవార్ప్ నుండి 5 కిలో వాట్స్ వరకు విద్యుత్తును వినియోగిస్తున్నారని, ఈ వినియోగంలో ఒక కిలో వాట్స్ కు మొత్తము చార్జీలు 1900 రూపాయలు ఉంటుందని, ఇందులో 50 శాతం పోను కేవలం 1250 రూపాయలు మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. అదేవిధంగా రెండు కిలో వాట్స్ కు 4,100 రూపాయలకు బదులు తగ్గింపులో 2,450, మూడు కిలో వాట్స్‌కు 6,300 రూపాయలకు బదులు తగ్గింపులో 3,650, నాలుగు కిలోవాట్సుకు 8,500కు బదులు తగ్గింపులో 4,850, అదేవిధంగా 5 కిలో వాట్స్ కు రూ.10,700 రూపాయలకు బదులు తగ్గింపులో రూ.6,050లు మాత్రమే చెల్లించవలసి ఉంటుందని తెలిపారు. ఈ చెల్లింపులు మీ సేవలో గాని, విద్యుత్ ఆన్లైన్ ద్వారా గాని చెల్లించే అవకాశం ఉందని తెలిపారు.

ప్రమాదాలను నివారించడమే లక్ష్యం

ధర్మవరం రూరల్ ఎస్సై శ్రీనివాసులు

విశాలాంధ్ర-ధర్మవరం: రోడ్డు ప్రమాదాలను నివారించడమే మా పోలీసుల లక్ష్యమని ధర్మవరం రూరల్ ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగే ప్రదేశమైన కొనుటూరు గ్రామ సమీపములో మామిళ్ళపల్లి కి వెళ్లే రోడ్డు నందు వంకపై గల బ్రిడ్జికి ఒకవైపు ఎల్లో బ్లింక్ లైట్, మరోవైపు రోడ్డు సేఫ్టీ కాషన్ బోర్డ్ ను ఏర్పాటు చేశారు. దీనివల్ల వాహనదారులకు ముందుగానే ఈ సూచిక బోర్డులు కనిపించడం వల్ల ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్త వహించే అవకాశం ఉందని తెలిపారు. వాహనదారులందరూ నెమ్మదిగా వాహనాలను నడిపినప్పుడే సుఖవంతమైన ప్రయాణముతో పాటు, సుఖంగా ఇంటికి చేరుకుంటారని తెలిపారు. వాహనాలను డ్రైవ్ చేసేటప్పుడు సెల్ఫోన్స్తో మాట్లాడరాదని, మద్యం తాగి డ్రైవ్ చేయరాదని వారు తెలిపారు. ఇలా సెల్ఫోన్ తో మాట్లాడుతూ మద్యం తాగి డ్రైవ్ చేస్తే ప్రమాదాలు జరగడంతో పాటు ప్రాణాలు కూడా పోయే అవకాశం ఉందని వారు తెలిపారు. కాబట్టి వాహనదారులందరూ కూడా రోడ్డు నియమ నిబంధనలు పాటించినప్పుడే ఎటువంటి ప్రమాదాలకు తావు లేదు అని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉరేసుకుని గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

విశాలాంధ్ర, గోరంట్ల .. గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గోరంట్ల మండలంలో చోటు చేసుకుంది, ఏఎస్ఐ షేక్షావలి తెలిపిన వివరాలు.. మృతుడికిదాదాపు 35 నుండి 45 ఏళ్ల వయసు ఉంటుందని చేతిపై అమ్మ ఏఎస్ అని, పాము పచ్చబొట్టు వేసుకున్నాడని, ప్యాంట్ షర్ట్ ధరించాడు. మృతుడి వివరాలు తెలియ రాలేదు. కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు,

మార్కెట్ యార్డు డైరెక్టర్లకు సన్మానం

విశాలాంధ్ర-ఓబుళదేవరచెరువు : కొత్త చెరువు వ్యవసాయ మార్కెట్ యార్డు నూతన డైరెక్టర్లుగా ఎంపికైన బుద్దల ప్రవీణ, మస్తానమ్మ, టైలరు నిజాం లను వడ్డెర్ల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వడ్డెర సంఘం నాయకులు పూలమాల శాలువతో ఘనంగా సన్మానించారు. మార్కెట్‌యార్డ్ నూతన కమిటీలో మండలానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ నలుగురికి డైరెక్టర్లుగా అవకాశం కల్పించిన మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి లకు తెలుగు తమ్ముళ్లు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వడ్డెర్ల సంఘం అధ్యక్షులు సాయిరామ్ అంజనేయులు, డాక్టర్ జాకీర్ అహ్మద్, బాలక్రిష్ణా రెడ్డి, డీలరు జయరామి రెడ్డి, ఇర్షాద్, చెన్నకేశవులు, ఆర్గానిక్ టి.హోటల్ వెంకటరమణ, వైభవీ కేఫ్ అంజి, కుంచపు శ్రీనివాసులు, డ్రైవర్ జయచంద్ర పాల్గొన్నారు.

గాలి, వానకు నేలకూలిన జీవి వృక్షం

విశాలాంధ్ర- నల్లమాడ: మండలంలోని దొన్నికోట గ్రామంలో నీల్లు బావి వద్ద నిర్మించిన శివాలయం ఆవరణంలో వున్న జీవి చెట్టు గురువారం అకాల వర్షానికి కురిసిన వాన గాలికి నేలకొరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు 80 సంవత్సరాల పాటు జీవి చెట్టుకు ప్రజలు పూజలు చేసేవారన్నారు.

770 రోజులుగా అన్న క్యాంటీన్ ..

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ నియోజకవర్గ కేంద్రం లో 770వ రోజు లుగా నిరుపేదలకు ఎన్టీఆర్ అన్న క్యాంటీన్ ద్వారా 770 వ రోజు చేనేత, జౌళి శాఖా మంత్రి సవితమ్మ భోజనం ఏర్పాటు చేస్తున్నారు. అలాగే నియోజకవర్గ వ్యాప్తంగా గత రెండు సంవత్సరాల నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద గర్భిణుల కోసం అన్నదానం చేస్తున్నారు. అన్న క్యాంటీన్ ఎంతగానో పేదలకు గర్భిణీ స్త్రీలకు ఉపయోగపడుతుందని మంచి పౌష్టికాహారం అందిస్తుండటం వల్ల సత్ఫలితాలు ఇస్తున్నాయని ప్రజలంతా కొనియాడారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

విశాలాంధ్ర-నంబులపూలకుంట: మండలంలోని అన్ని గ్రామాలలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సాలేహా బాషా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కదిరిలోని కుటాగుళ్ల 132 కెవి సబ్ స్టేషన్‌లో మరమ్మత్తుల కారణంగా ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ నిలిపివేయబడుతుందని, రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇచ్చిన అప్పు అడిగితే కులం పేరుతో దాడి

విశాలాంధ్ర-కదిరి టౌన్: ఇచ్చిన అప్పు అడిగితే కులం పేరుతో దూషించి, కొట్టినారని ఒకరు, చెడు వ్యసనాలకు అలవాటు పడి అప్పులు చేస్తున్న మా కొడుక్కు ఎవరూ అప్పులు ఇవ్వద్దన్నా ఇచ్చి ఇంటి దగ్గరకి వచ్చి దాడి చేశారని మరో ఫిర్యాదు మేరకు ఇద్దరిపై శుక్రవారం పోలీసులు కేసులు నమోదు చేశారు. అర్బన్ సీఐ నారాయణరెడ్డి తెలిపిన వివరాలు..కదిరి మండలం చిగురుమాను తాండ గ్రామానికి చెందిన కలావాత్ రాము నాయక్ కదిరి టౌన్, ఆంజనేయ స్వామి గుడి వద్ద నివాసం ఉంటూ సిరి జ్యువెలర్స్ షాప్‌లో పనిచేస్తున్నాడు, ఇతను మారుతీ నగర్ లో నివాసము ఉండే ఉదయ్ కుమార్ వద్ద రూ.20 వేలు అప్పుగా తీసుకున్నాడు. ఇచ్చిన అప్పు తిరిగి ఇవ్వమని తాను ఎన్నిమార్లు అడిగిన ఉదయకుమార్ స్పందించ లేదు. వారి తల్లితండ్రులకు జరిగిన విషయం చెప్పగా వారు తనతో గొడవ పడి అతడిని కులం పేరుతో దూషించి, రోకలి బండతో దాడి చేసి గాయపరిచారు. అడ్డుగా వచ్చిన అన్నను కూడా కులం పేరుతో దూషించారని ఇచ్చిన పిర్యాదు మేరకు గోవిందు, రామంజనమ్మ, శ్రావణ్ అను వారిపై ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు రిజిస్టర్ చేసి దర్యాప్తు చేపట్టారు. ఇదే సంఘటనలో కోడి గోవింద్ అను అతను ఇచ్చిన షిర్యాదు మేరకు తన కుమారుడు ఉదయ్ కుమార్ కొరకు తన ఇంటి వద్దకు వచ్చిన రాము నాయక్ అను వ్యక్తి తన కుమారుడు వాళ్లకు డబ్బులు ఇవ్వాలని అడుగగా తానూ వాడు చెడు అలవాట్లకు బానిస అయ్యాడని, మా అబ్బాయికి ఎవ్వరు డబ్బులు ఇవ్వవద్దని తానూ అందరికి చెప్పానని, వాడు చేసిన అప్పులు నేను ఎలా ఇవ్వాలని అడుగగా అందుకు రాము నాయక్ వారి ఇంట్లోకి దౌర్జన్యంగా ప్రవేశించి తోసివేయడముతో తన కాలుకు వాపుడు గాయం అయిందని. బాధితుడు ఫిర్యాదుచేసినట్లు సీఐ పేర్కొన్నారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, శనివారం 09, ఆగస్టు 2025

ఓటర్ల లిస్టును సుప్రీంకోర్టుకు అందజేయాలి

సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాంభూపాల్ డిమాండ్..

విశాలాంధ్ర-ధర్మవరం: బీహార్ రాష్ట్రంలో రద్దు చేసిన ఓటర్ల లిస్టును సుప్రీంకోర్టుకు అందజేయాలని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాంభూపాల్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు బీహార్లో జరిగిన ఓటర్ల రద్దును నిరసిస్తూ ధర్మవరం అంబేద్కర్ సర్కిల్ నందు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం కామ్రేడ్ రాంభూపాల్ మాట్లాడుతూ బీహార్ రాష్ట్రంలో జరగబోయే ఎన్నికల సందర్భంగా దాదాపుగా 80 లక్షల మంది ఓట్లను గల్లంత చేయడం జరిగినదని, గల్లంతైన ఓటర్స్‌లో ఎక్కువమంది బడుగు, బలహీన వర్గ ప్రజలు, బిసి వర్గ ప్రజలు, మైనారిటీలు, వలసలు వెళ్లిన ప్రజలు ఉన్నారని తెలిపారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓట్లు నమోదు అయితాయమని అనుమానంతో అర్హులైన ఓటర్లను అందర్నీ ఓటర్ల లిస్టులో నుంచి తొలగించడం జరిగినదని తెలిపారు. తొలగించిన ఓటర్ల సంబంధించిన వివరాలను సుప్రీంకోర్టుకు అందించాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ అధికారులు స్పందించకుండా సమయం సరిపోదని తెలపడమే కాక, పూర్తిగా అధికార పార్టీ హస్తం ఉన్నదని వారు ఆరోపించారు. ఇటువంటి విధానాలను ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మానుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా నాయకులు పెద్దన్న, వెంకటేష్, శ్రీనివాసులు, దిల్షాద్, లక్ష్మీనారాయణ, మారుతి, జేవీ రమణ, ఆదినారాయణ, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసపూరిత హామీలు

విశాలాంధ్ర-యాడికి: యాడికి మండల కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీ, మండల పరిధిలోని తిరునాంపల్లి గ్రామంలో శుక్రవారం వైసిపి మండల సీనియర్ నాయకులు బాలా రమేష్ బాబు ఆధ్వర్యంలో వైసిపి నాయకులతో కలిసి రీ కాల్ మేనిఫెస్టో బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలా రమేష్ బాబు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు. హామీల అమల్లో వివరమైంది అన్నారు. టిడిపి నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం హామీల వైఫల్యం గురించి ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించారు .ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కోడూరు సుబ్బారెడ్డి , జూటూరు భాస్కర్ రెడ్డి,మక్కల చిన్న రామాంజనేయులు, చందా చౌడయ్య చందా రామాంజనేయులు, వెంకట రంగారెడ్డి ,ఎరుకులప్ప, చిదంబర రెడ్డి ,కొండారెడ్డి ఆనంద్ రెడ్డి కరుణాకర్ పాల్గొన్నారు.

ఘనంగా వరలక్ష్మీ వ్రతం పూజ కార్యక్రమాలు..

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని మరియు గ్రామీణ ప్రాంతాలలో శుక్రవారం హిందువులు ఎంతో పరమ పవిత్రంగా చేసుకొనే పండుగ వరలక్ష్మి వ్రతం ప్రతి ఇంట గడప లేక పూజా కార్యక్రమాలు దేవాలయముల నందు పూజా కార్యక్రమాలు నిర్వహించారు శ్రీ లక్ష్మీ అమ్మవారిని ప్రతిమ రూపంలో నిలిపి అమ్మవారికి అనేక విశేష పూజలు చేశారు, ధనలక్ష్మి ధాన్యలక్ష్మి, వరలక్ష్మి, సంతాన లక్ష్మి, అనేక రూపాలలో ఉన్నటువంటి మహాలక్ష్మి దేవిని వరలక్ష్మి అవతారంలో అమ్మవారికి విశేష అలంకరణ చేసి పూజలు నిర్వహించారు.

నారాయణ సేవలో గర్భిణీలకు అన్నదానం

విశాలాంధ్ర-పెనుకొండ: ప్రభుత్వ హాస్పిటల్ కు వైద్య చికిత్సల కొరకు వచ్చినటువంటి గర్భిణీ స్త్రీలకు వారి సహాయకులకు ఇతరత్రా అనారోగ్యంతో వచ్చినవారికి, ఆరోగ్య కార్యకర్తలకు, నారాయణ సేవ చేయాలనిసంకల్పముతో,నారాయణ సేవలో భాగంగా సుమారు150 మందికి అన్నదానం, వాటర్ ప్యాకెట్ అందజేసి నారు. ఈ కార్యక్రమానికి కోనాపురం ఈశ్వరయ్య, వారి గీతావాణి దంపతులు సహకరించి, వారి కుటుంబ సభ్యులు తొ సేవలో పాల్గొని, సేవలు అందించినారు. వీరికి, వీరి కుటుంబ సభ్యులకు, సేవలో పాల్గొన్న వారందరికీ భగవాన్ బాబా వారి యొక్క అనుగ్రహ ఆశీస్సులు కలిగి ఉండాలని కోరుకుంటున్నామని సత్యసాయి తాలూకా సేవా సమితి అధ్యక్షులు శంకర్ తెలిపారు.

ఘనంగా వరలక్ష్మీ వ్రతం పూజలు

విశాలాంధ్ర-గుడిబండ: మండల వ్యాప్తంగా మహిళలు భక్తిశ్రద్ధలతో ఉపావసదీక్షతో వరలక్ష్మీ వ్రతం పూజలు అన్ని గ్రామాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో శుక్రవారం హిందువులు ఎంతో పరమ పవిత్రంగా చేసుకొనే పండుగ వరలక్ష్మి వ్రతం ఆచరించామని తెలిపారు.శ్రీ వరలక్ష్మీ అమ్మవారిని ధనలక్ష్మి,ధాన్యలక్ష్మి,వరలక్ష్మి,సంతానలక్ష్మి,అష్ట లక్ష్మి,ఐశ్వర్య లక్ష్మి,విద్య లక్ష్మి,రూపాలలో ఏర్పాటుచేసి మహాలక్ష్మి దేవిని వరలక్ష్మి అవతారంలో అమ్మవారికి విశేష అలంకరణ చేసి పూజలు నిర్వహించారు.మరియు పలారం గుడిబండ కుంబార నాగేపల్లి గ్రామాలలో వెలిసిన అమ్మవారికి పూలహారతులు నిర్వహించారు.అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం

విశాలాంధ్ర-బొమ్మనహాల్: మండలంలో వివిధ గ్రామాల్లోనిశ్రావణమాసం రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలు, నిష్టతో పాటించారు. అమ్మవారి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. అమ్మవారి ఆలయాలతో పాటు ఇళ్లలో మహిళలు నిష్టతో వరలక్ష్మీదేవి వ్రతాన్ని ఆచరించారు. మండలంలోని గోవిందవాడ, ఉద్దేహాళ్, బొమ్మనహాళ్, ఉంత క ల్లు, తదితర గ్రామ లోని వెలసిన అమ్మవారిఆలయంలో మహిళలు హాజరై పూజ చేశారు.

బాబు షూరిటీ.. మోసం గ్యారెంటీ

విశాలాంధ్ర -నల్లమాడ : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చలేని ప్రభుత్వం విఫల మైందని వైసీపీ మండలం కన్వీనర్ సిటీబాల ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. వంకరకుంట గ్రామంలో బాబు షూరిటీ మోసంగ్యారెంటీపై కార్యక్రం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అధికారంలోకి రావడానికి అనేక వాగ్దానాలు ఇచ్చి అవి అమలు పరచడములో ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు టీడీపీ పాలనలో ప్రజలు చంద్రబాబు పాలన మోసాలు గురించి తెలుసుకోవాలన్నారు. ప్రజలకు చేస్తున్న మోసాలపై వైఎస్సాసిపి నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించి తెలియజేయవలసిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి పొర కల రమణ, ఎస్టీ సెల్ రాష్ట్ర నాయకులు కుల్లాయి నాయక్, సర్పంచ్ కుళ్లాయప్ప, నాయకులు లింగమూర్తి బొనాయక్ ఎంపీటీసీలు ఆయా గ్రామాల నాయకులు ఓబిరెడ్డి. నాగరాజు నాయుడు.షంషేర్. నాగార్జున రెడ్డి, విజయ శేఖర్ రెడ్డి, సూర్యనారాయణ, చంద్రహాస్ రెడ్డి, సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేవతోనే స్ఫూర్తి దాతలు అవుతారు

శ్రీ సత్య సాయి సేవా సమితి కన్వీనర్ నామా ప్రసాద్..

విశాలాంధ్ర-ధర్మవరం: సమాజంలో ప్రతి వ్యక్తి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తే ఎంతోమందికి స్ఫూర్తి దాతలు అవుతారని, ఇందువల్ల మానవతా విలువలు పెరుగుతాయని శ్రీ సత్య సాయి సేవా సమితి (గాంధీనగర్) కన్వీనర్ నామా ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా వారు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో 380 మంది రోగులకు సహాయకులకు భోజనపు ప్యాకెట్లను, వాటర్ ప్యాకెట్స్ లను ఆసుపత్రి వైద్యులు, సిస్టర్ల చేతుల మీదుగా అందజేశారు. అనంతరం నామా ప్రసాద్ మాట్లాడుతూ నేటి ఈ సేవా కార్యక్రమానికి పట్టణంలోని అరిగెల పోతన్న హాస్పిటల్ అధినేత డాక్టర్ గణేష్ వారి సహాయ సహకారాలతో నిర్వహించడం జరిగిందని తెలిపారు. తదుపరి వారికి సత్య సాయి సేవ సమితి తరపున కృతజ్ఞతలను తెలియజేశారు. అంతేకాకుండా ప్రభుత్వ ఆసుపత్రిలోని గర్భిణీ స్త్రీలకు ప్రత్యేకంగా స్వీట్లు కూడా పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఇటువంటి సేవా కార్యక్రమాలకు ఆసక్తి కలవారు సెల్ నెంబర్ 9966047044 గాని 903044065కు గాని సంప్రదించాలని తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి సూపరిడెంట్ తిపేంద్ర నాయక్ మాట్లాడుతూ శ్రీ సత్య సాయి సేవ సమితి వారు చేస్తున్న ఇటువంటి సేవా కార్యక్రమాలు రోగులకు వరంగా మారాయని తెలిపారు. దాతల సహాయ సహకారంతో ఇటువంటి కార్యక్రమం నిర్వహణ ఎంతో సంతోషించదగ్గ విషయమని వారు తెలిపారు. అనంతరం ఆసుపత్రి తరపున సత్యసాయి సేవా సమితి వారికి సూపరిడెంట్ ప్రత్యేక కృతజ్ఞతలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 27 మంది సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

పథకాల అమలులో..

కూటమి ప్రభుత్వం వైఫల్యం

విశాలాంధ్ర-యాడికి: యాడికి మండల పరిధిలోని కత్తిమానుపల్లి గ్రామంలో రీ కాల్ మ్యానిఫెస్టో రీకాల్ చంద్రబాబు కార్యక్రమాన్ని శుక్రవారం వైయస్ఆర్సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ వెన్నపూస వెంకటరామిరెడ్డి ,వైసీపీ మండల కన్వీనర్ సంజీవరాయుడు. ఆధ్వర్యంలో వైసిపి నాయకులతో కలిసి నిర్వహించారు. గ్రామంలోని ప్రజల ఇంటి దగ్గరికి దగ్గరికి వెళ్ళినప్పుడు జగనన్న సీఎం గా ఉన్నప్పుడు పథకాలు అన్నీ సక్రమంగా వాలంటీర్స్ ఇంటి దగ్గరికి తెచ్చి ఇచ్చే వారని ఇప్పుడు యే పథకం కావాలన్నా మండల ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా సమస్యలు తీరడం లేదు అని బాధపడ్డారు. ముఖ్యంగా మహిళలు మహిళా సంఘం రుణ మాఫీ, సున్నా వడ్డీలు, 45 సంవత్సరాల డబ్బులు పడేవి ఇప్పుడు అవన్నీ ఏమి లేవు అని వాపోయారు. మళ్ళీ ఈ పథకాలు కొనసాగాలంటే ముఖ్యమంత్రిగా జగనన్న ప్రభుత్వమే, కావాలని ప్రజలు కోరుకుంటున్నారు. చంద్రశేఖర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, రవీంద్రారెడ్డి, లోకేశ్వర రెడ్డి, చంద్రాస రెడ్డి, సునీల్ రెడ్డి,సుధాకర్, శ్రీనాథ్, రాముడు,పుల్లయ్య,కృష్ణ రెడ్డి,నరేష్, చిన్న శ్రీరాములు, నారాయణ, వెంకట రామిరెడ్డి, దేవనాథ రెడ్డి, బాలన్న, వెంకట రాము డు, కంబగిరి రాముడు, కృష్ణ రెడ్డి, ఆదినారాయణ రెడ్డి పాల్గొన్నారు.

శ్రీరామ నగర్ కాలనీ ప్రారంభోత్సవంలో మంత్రి

విశాలాంధ్ర-ఉరవకొండ: వజ్రకరూరు మండలం బోడిసానిపల్లి గ్రామంలో శుక్రవారం శ్రీ ఆంజనేయ స్వామి, నాగప్రతిష్ట, ధ్వజస్తంభ శిఖర గ్రామశిల ప్రతిష్ట మరియు శ్రీరామనగర్ కాలనీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు. మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ఈ శుభ కార్యక్రమంలో పాలుపంచుకోవడం చాలా సంతోషం అన్నారు. శ్రీ ఆంజనేయ స్వామి గుడి ప్రారంభోత్సవం, కొత్తగా ఒక గ్రామం 40 ఏళ్లు నివసించేలా ఏర్పాటు చేసుకోవడం ఆనందకరమన్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో ఏ అభివృద్ధి కార్యక్రమం జరిగినా అందులో పాలు పంచుకోవడం తనకెంతో సంతోషమని, 1994 నుంచి ఇప్పటివరకు రాజకీయ అభివృద్ధిలో, ప్రతి దశలో ప్రజలంతా నన్ను ఆశీర్వదిస్తూ వచ్చారన్నారు. రాజకీయ ఎదుగుదలలో ఇంతటి మహోన్నత స్థాయికి తీసుకురావడానికి సహకరించిన నాయకులకు, ఉరవకొండ నియోజకవర్గం ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటానన్నారు.

ఘనంగా వరలక్ష్మీ వ్రతం

విశాలాంధ్ర-కొత్తచెరువు: మండల వ్యాప్తంగా వరలక్ష్మి వ్రతం వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఉదయానే ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్త చెరువులోనే పెద్దమ్మ ఆలయం కొత్తచెరువమ్మ ఆలయం కన్యకా పరమేశ్వరి ఆలయాల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయాలు భక్తుల సందడితో కిక్కిరిశాయి అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

హిందూ సంస్కృతి సాంప్రదాయాలను పాటించినప్పుడే సుఖవంతమైన జీవితం లభిస్తుంది.. అర్చకులు

విశాలాంధ్ర-ధర్మవరం: మన దేశంలో హిందూ సంస్కృతి సాంప్రదాయాలను పాటించినప్పుడే సుఖవంతమైన జీవితము లభిస్తుందని అర్చకులు కోనేరాచార్యులు, మకరంద బాబు, భాను ప్రకాష్, చక్రధర్ తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో వరలక్ష్మి వ్రతం పండుగ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు వరలక్ష్మీ వ్రతమును అర్చకులు ద్వారా సామూహికంగా నిర్వహించుకున్నారు. అర్చకులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం దేవాలయంలో హిందూ సాంప్రదాయ పద్ధతిలో ఇటువంటి వేడుకలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. వరలక్ష్మీ వ్రతం ఇంటింటా నిర్వహించడం కూడా జరిగిందని తెలిపారు. ఈ వ్రతాలు నిర్వహించినప్పుడు కుటుంబంలోని కష్టాలు తొలగిపోయి సుఖవంతమైన జీవితము లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో వెంకటేశులు, అడహక్ ఛైర్మన్ చెన్నం శెట్టి జగదీశ్వర ప్రసాద్, భక్తాదులు పాల్గొన్నారు.

ఇంటింటా వరలక్ష్మి వ్రత వైభవం

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండ మండలంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని స్థానిక చౌడేశ్వరీదేవి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు. ఆలయంలో అమ్మవారు వరలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గాభవాని ఆలయంలో అమ్మవారికి అభిషేకాలు, పూజలు, కుంకుమార్చన చేశారు. మండలంలోని పెన్నహోబిలం ఉద్భవలక్ష్మి ఆలయంలో వరలక్ష్మి వ్రతాన్ని ఆచరించారు.

ఆలయాల్లో శ్రావణమాస శోభ

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం: శ్రావణ శుక్రవారం విశిష్టమైన వరలక్ష్మీ వ్రతం సందర్భంగా శ్రీ వాసవీ మాతకు, మరియు శ్రీ కన్యకాపరమేశ్వరీదేవికి నూతన పట్టుచీరలచే అలంకారం చేశారు. కళ్యాణదుర్గం పట్టణంలోని ఆలయాలతో భక్తుల తాకిడి ఎక్కువైంది. వరలక్ష్మీ వ్రతం శ్రావణ శుక్రవారం కావడంతో భక్తులు ప్రత్యేక భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలకు వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ఎమ్మెల్యే సురేంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు.